

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

జిల్లా కేంద్రంలో బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభమైంది. 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

- 8లో



ఉద్దానంలో విధ్వంసం వద్దు

కార్గో ఎయిర్‌పోర్టుపై ఉద్దానంలో నిరసన గళం వినిపిస్తోంది. ఉద్దానంలో విధ్వంసం వద్దంటున్నారు.

- 8లో

బుడితి సీహెచ్‌సీలో తగ్గిన ఓపీ

సారవకోట: బుడితి సీహెచ్‌సీలో ఓపీ తగ్గింది. ఇక్కడ సోమవారం ప్రసూతి ఆపరేషన్లు ముగ్గురికి చేయగా అందులో ఇద్దరు బాలింతలు మంగళవారం మృతి చెందారు. దీంతో ప్రస్తుతం ఆస్పత్రికి సాధారణ సేవలకు కోసం వచ్చే రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఆపరేషన్లు చేసిన రోజు సోమవారం ఓపీ 178 ఉండ గా, మంగళవారం 69, బుధవారం నాటికి 50, గురు, శుక్రవారాలలో 40, శనివారం నాటికి మరింత తగ్గింది.

న్యూస్‌రీల్

జిల్లాలో ఎరువుల కొరత లేదు: కలెక్టర్



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం వెల్లడించారు. ప్రతి రైతు తమకు కావాల్సిన ఎరువులు తీసుకోవచ్చన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు ప్రభుత్వం 50% ప్రైవేటు వర్తకులు 50% సొసైటీలు లేదా రైతు సేవా కేంద్రాలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో యూరియా 10583 ఎంటీఎస్, డీఏపీ 6402 ఎంటీఎస్, పోటాష్ 922 ఎంటీఎస్, కాంప్లెక్స్ 3084 ఎంటీఎస్, సూపర్ పాస్ఫేట్ 842 ఎంటీఎస్ సరఫరా చేశామన్నారు. ఇందులో రైతు సేవా కేంద్రాలకు 50 శాతం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జూలై 5 నాటికి జి.సిగడాం మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు యూరియా 239 ఎంటీఎస్, డీఏపీ 80.0 ఎంటీఎస్, మండల వ్యవసాయ అధికారి ప్రతిపాదనలు మేరకు మొత్తం 319.76 ఎంటీఎస్ సరఫరా చేశామని, ఈ వారంలో యూరియా 140.0 ఎంటీఎస్ సరఫరా చేయడానికి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రతిపాదనలు చేశామని పేర్కొన్నారు. కావాల్సిన ఎరువుల విషయమై రాష్ట్ర కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించామని, జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని తెలియజేశారు.

గుడి చెంతనే మద్యం షాపు



ఉర్లాం ఎస్సీ కాలనీ వైపు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న మద్యం షాపు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో వేంకటేశ్వరాలయం, అంగన్‌వాడీ కేంద్రాల చెంతనే మద్యం షాపు పెట్టడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. దీన్ని మరో చోటకు మార్చాలని కోరుతున్నారు. ఆలయానికి వంద మీటర్ల లోపునే మద్యం షాపు ఉందని స్థానికులు అంటున్నారు. అలాగే అక్కడే అంగన్‌వాడీ కేంద్రం ఉందని చెబుతున్నారు. ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మరో చోటకు మద్యం షాపును మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుల్ నియామక పరీక్షలో భవానీకి రెండో ర్యాంకు



భవాని

మందస: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ నియామక పరీక్షలో మందస మండలం పిడిమందస గ్రామానికి చెందిన సేనాపతి భవాని రాష్ట్రస్థాయి మహిళల కేటగిరీలో రెండో ర్యాంకు సాధించింది. భవానీ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అభ్యసించారు. మహిళల విభాగంలో 154 మార్కులతో ఈ ర్యాంకు సాధించింది.

నిఘా నిద్దరోతోందా..?



పోలీసు పహారా మధ్య గోపి మృతదేహాన్ని ఇంటికి తీసుకువస్తున్న దృశ్యం

- టీడీపీ హయాంలోనే ఫరీదుపేటలో హత్యలు
- ఇప్పటివరకు జరిగిన నాలుగు హత్యలు చంద్రబాబు పాలనలోనే
- టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి రెచ్చిపోతున్న రౌడీ మూకలు
- సునాయాసంగా ప్రత్యర్థులను హతమారుస్తున్న పరిస్థితి
- పోలీసు పికెట్ ఉన్నా హత్య జరగడంతో మరింత అనుమానాలు
- పోలీసులు ఉదాసీనతే హత్యకు కారణమని బాధిత కుటుంబీకుల ఆరోపణ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటపై చెరిగిపోని రక్తపు మరకలు పడుతున్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఇక్కడ హత్యలు జరుగుతున్నాయి. పోలీసులు కూడా ఏం చేయలేకపోతున్నారు. హత్యలు జరిగాక సీన్ ఆఫ్ అఫెన్స్‌కు వచ్చి హడావుడి చేస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామంలో జరిగిన నాలుగు హత్యలు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగినవే కావడం గమనార్హం. టార్గెట్ ప్రకారం ప్రత్యర్థులను కిరాతకంగా చంపేస్తున్నారు.

చంద్రన్న పాలనలో హత్యలు..



గత ఏడాది టీడీపీ వర్గీయుల దాడిలో మృతి చెందిన ప్రసాద్

2001 జూన్ 21న చంద్రబాబు అధికారంలో ఉండగా వైస్ ఎంపీపీగా పనిచేసిన కోటిపాత్రుని పోలినాయుడు హత్యకు గురయ్యారు. దీనికి ప్రతీకార హత్య కూడా 2002 ఆగస్టులో జరిగింది. మొదలవలస రాంబాబును చంపేశారు. పార్టీల విషయం పక్కన పెడితే హత్యా రాజకీయాలకు ఫరీదుపేట వేదికైంది. ఆ తర్వాత కొన్ని ఘటనలు జరిగినా హత్యల వరకు వెళ్లలేదు. మళ్లీ తాజాగా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక హత్యల పరంపర మొదలైంది. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో అంటే గత ఏడాది ఆగస్టులో వైఎస్సార్‌సీపీకి చెందిన కూన ప్రసాద్‌ను టీడీపీ మూకలు హత్య చేశాయి. తాజాగా వైఎస్సార్‌సీపీకి చెందిన సత్తారు గోపిని మళ్లీ టీడీపీ వాళ్లే పట్ట పగలు దాడి చేసి చంపేశారు. ఈ హత్యలన్నీ దాదాపు టీడీపీ హయాంలోనే జరిగాయి.

నిఘా వైఫల్యమేనా..?

టీడీపీ పాలనలో నిఘా వైఫల్యమో? వ్యవస్థను పోలీసుల గుప్పెట్లో పెట్టుకోవడమో తెలీదు గాని



గ్రామంలోకి మృతదేహం తీసుకువస్తున్న దృశ్యం

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఫరీదుపేటలో హత్యలు జరుగుతున్నాయి. తాజాగా సత్తారు గోపి హత్యకు దారితీసే పరిస్థితులపైన ఆరోపణలు ఉన్నాయి. కూన ప్రసాద్ హత్య కేసులో తొమ్మిది మంది వరకు ఉన్నా నలుగుర్ని మాత్రమే నిందితులుగా చూపించి, మిగతా వారికి యాంటిసిపేటరీ బెయిల్ వచ్చేలా పోలీసులు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని సత్తారు గోపి కుటుంబీకులే నేరుగా ఆరోపిస్తున్నారు. ఆ ఘటనకు సంబంధించిన ప్రధాన నిందితులను విడిచిపెట్టడం వల్లే ఈ హత్య జరిగిందని, వారే గోపిని హత్య చేశారని ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారు లను సైతం మృతదేహం వద్దకు రాకుండా అడ్డుకు న్నారంటే పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చు. చివరి కీ ఎచ్చెర్ల ఎస్‌ఐ తీరుపై నేరుగా మండిపడ్డారు. తక్షణమే ఆయన్ని సస్పెండ్ చేయాలని కూడా డిమాండ్ చేశారు.

పోలీసు పికెట్ ఉన్నా...

గత ఏడాది ఆగస్టులో కూన ప్రసాద్ హత్య తర్వాత ఫరీదుపేటలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకూడదన్న ఉద్దేశంతోనే పికెట్ పెట్టారు. అయినప్పటికీ మరో హత్య జరిగిందంటే ఏమనుకోవాలో తెలియని పరిస్థితి నెలకుంది. అసలు నిఘా వ్యవస్థ ఏమైంది? సమస్యాత్మక గ్రామంపై పర్యవేక్షణ కొరవడిందా? లేదంటే ఎవరైనా ప్రభావితం చేశారా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగమే దీనికి కారణమా అన్న అనుమానాలు తలెత్తక మానలేదు. నిఘా వైఫల్యానికి ఇదొక నిలువెత్తు సాక్ష్యంగా చెప్పవచ్చు. ప్రస్తుత ఎంపీపీ మొదలవలస చిరంజీవిని హతమార్చడానికి గత ప్రభుత్వం సమయంలో కొందరు ప్రయత్నిస్తే, నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో ఆ సమయంలో కుట్రదారులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. ఇప్పుడు నిఘా ఏమైందో పక్కన పెడితే పోలీసు పికెట్ ఉండి కూడా హత్య జరగడం విస్మయం కలిగిస్తోంది. శాంతిభద్రతలపై కాకుండా కక్షపూరిత రాజకీయాలపై దృష్టి పెట్టడం, పోలీసులను సైతం సక్రమంగా పనిచేయక పోనివ్వకపోవడం వల్లనే హత్యలకు అవకాశం ఏర్పడిందన్న వాదనలు ఉన్నాయి. కూన ప్రసాద్ హత్య జరిగినప్పుడే పోలీసు ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిద్దామని భావించినా అధికారంలో ఉన్న పెద్దలు అడ్డు తగిలారు. దాని పర్యవసానమే తాజా హత్య అని ఆరోపణలు ఉన్నాయి.

గోపి కుటుంబానికి అండగా ఉంటాం

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మాట్లాడుతున్న బెల్లాన చంద్రశేఖర్, గొర్లె కిరణ్

ఎచ్చెర్ల: ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూటమి ప్రభుత్వం అరాచకాలు సృష్టిస్తోందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఫరీదుపేట గ్రామంలో హత్యకు గురైన సత్తారు గోపి కుటుంబాన్ని పరామర్శించడానికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు గోపిని దారుణంగా హత్య చేశారని, ఇంతకు ముందు ఆయన కారు డ్రైవర్‌ను హత్య చేశారని, అప్పుడు ప్రధాన కారకులను కేసు నుంచి తప్పించారని అన్నారు. పోలీసు పికెటింగ్ ఉన్నా హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. గోపి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. భార్యాభర్తల తగువు మధ్యలో వ్యక్తిని హత్య చేయడం రాజకీయమని అన్నారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ దీనికి పూర్తిగా సహకరించారని ఆరోపించారు. ఆయన సమక్షంలో భార్యాభర్తల గొడవకు సంబంధించి 41 నోటీసులు ఇవ్వడానికి 20 మంది పోలీసులు రావడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడి విషయాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. హత్యకు ప్రధాన కారకులు బయట కాలర్ ఎగరేసుకుని తిరుగుతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దీనిపై ఎస్పీ సమగ్ర దర్యాప్తును నిర్వహించి దోషులను వెంటనే శిక్షించాలని అన్నారు. చనిపోయిన గోపి అనే వ్యక్తికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, బాబుకు కాలు విరిగిందని, పాప ఇంటర్ చదువుతోందని, ఆ కుటుంబం వీధిన పడిందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోరసాయిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జెడ్పీటీసీలు మీసాల సీతంనాయుడు, పిన్నింటి సాయికుమార్, నీలమప్పుడు, శీరపు, శ్రీరామూర్తి, గోవిందరెడ్డి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫరీదుపేట గ్రామంలో పోలీసు పహారా

పోలీసుల భద్రతా వలయంలో ఫరీదుపేట

- డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు సహా దాదాపు 300 మందితో పికెటింగ్
- పోలీసుల సమక్షంలోనే సత్తారు గోపి అంత్యక్రియలు

శ్రీకాకుళం క్రైమ్/ఎచ్చెర్ల : జిల్లాలోని ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ కార్యకర్త సత్తారు గోపి ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురికావడంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి దాదాపు 300 మందితో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేశారు. శ్రీకాకుళం, కాశీబుగ్గ డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, వీవీ అప్పారావులే కాక సీఐలు, ఎస్‌ఐలు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, పోలీస్ కమాండోలు, ఏఆర్ సిబ్బందితో ఫరీదుపేట ఇళ్ల గడపలు నిండిపోయాయి. దాదాపు ఊరి నుంచి జాతీయ రహదారి వరకు అడుగడుగునా పోలీసులు కనిపించారు.

12 మందిపై ఎఫ్‌ఐఆర్.. అదుపులో నలుగురు..?

మృతుడు గోపి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది కీలక నిందితులను, మరో నలుగురు అనుమానితులను పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారని, ఇప్పటికే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఓ నిర్మానుష్య ప్రాంతంలో హత్య జరగడం, అక్కడ ఓ చెట్టుపై సీసీ కెమెరాలున్నా వారం రోజుల కిందటే పాడు చేయడం, హత్య జరిగిన రోజు అవి పనిచేయకపోవడం వంటివి అనుమానాలను బలపరుస్తున్నాయి. శనివారం ఉదయం రిమ్స్‌లో సత్తారు గోపి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి 11.30 గంటలకు గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం పోలీసుల సమక్షంలోనే అంత్యక్రియలు జరిగాయి.

శాంతియుతంగా ఉండాలి..

1951లో డబుల్ మర్డర్‌తో ఈ గ్రామంలో తగాదాలు ప్రారంభమయ్యాయి. గౌరీదేవి ఉత్సవాల్లో గొడవ వచ్చింది. మొదట్లో రెండు గ్రూపులు గ్రామానికి నాయకత్వం వహించేవారు. గ్రూపులుగా ఎప్పుడూ కొట్టుకోరు. అదను చూసి సింగిల్‌గా ప్రత్యర్థి వస్తే దాడికి ఎగబడతారు. గ్రామస్తులు శాంతియుతంగా ఉండాలి.

– ఎం.అవతారం, సీఐ, జి.ఆర్.పురం

చంద్రబాబు మోసాలను ఎండగడదాం



టెక్కలి: బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ధర్మాన కృష్ణదాస్, కుంబా రవిబాబు, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, పేరాడ తిలక్, దుంపల లక్ష్మణరావు, వాణి

- పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- టెక్కలి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో కూటమి పాలనపై ధ్వజమెత్తిన నేతలు

టెక్కలి:

అధికారం కోసం సాధ్యం కాని హామీలు ఇవ్వడం, అధికారం దక్కాక మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో 143 వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబు ఏమీ అమలు చేయలేదని, ఆ మోసాలను గ్రామస్థాయిలో వివరించాలని ఆయన, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కుంబా రవిబాబు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు పిలుపునిచ్చారు. శనివారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయిలో సమావేశంలో కృష్ణదాస్ మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలిచ్చినపుడు రాష్ట్ర ఆదాయం సరిచూసుకోలేదా అని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో మూలపేట పోర్టు, ఉద్దానం ప్రాంతానికి సురక్షితమైన నీరు, కిడ్నీ సమస్యలకు ఆస్పత్రి రూపంలో పరిష్కారం చూపిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తురామారావు, పార్టీ కాళింగ కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, జెడ్పీటీసీలు దువ్వాడ వాణి, పాల వసంత్‌రెడ్డి, పేరాడ భార్గవి, దుబ్బ వెంకట్రావు, ఎంపీపీలు ఆట్ల సరోజనమ్మ, నడుపూరు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హామీలపై నిలదీయాలి..



ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలపై కచ్చితంగా నిలదీయాలి. ప్రశ్నిస్తుంటే కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోంది. రైతులను కూడా అరాచక శక్తులుగా చూపిస్తోంది. వైఎస్ జగన్‌పై లేనిపోని ఆంక్షలు పెడుతోంది. 40 శాతం ఓటు బ్యాంక్ ఉన్న వైఎస్సార్ సీపీని తోలు తీస్తాం.. తాట తీస్తాం అంటే ఊరుకునేది లేదు.

– కుంభా రవిబాబు, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు

ప్రశ్నిస్తే కేసులు, దాడులు



హామీలపై ప్రశ్నిస్తుంటే అన్యాయంగా కేసులు పెట్టి దాడులు చేస్తున్నారు. చివరకు కూటమి నాయకుల కక్ష సాధింపు చర్యలకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజీనామాలు చేస్తున్నారు. జిల్లాలో నాగావళి, వంశధార నదుల్లో ఇసుక దోపిడీ జరుగుతోంది.

– తమ్మినేని సీతారాం, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త

కార్యకర్తలే రారాజులు



రానున్న జగన్ 2.0లో పార్టీ కార్యకర్తలే రారాజులు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా.. టీడీపీని ఎప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 40 ఏళ్ల టీడీపీ పాలనలో సాధ్యం కానిది కేవలం ఒకే ఒక్క పర్యాయంలో వైఎస్ జగన్ చేసి చూపించారు.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

టీడీపీవన్నీ ప్రగతి వేషాలు

- ఈ ప్రాంత బాగుకోసం ఎందాకైనా పోరాటం చేస్తా
- శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్:

వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాను టీడీపీ దశాబ్దాలుగా మోసం చేస్తోందని, ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించిన సందర్భం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో కనీసం జిల్లాకు రూ.వెయ్యి కోట్లు కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. అంతా కూటమి ప్రభుత్వం అంటున్నారు గానీ ఇది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడలేకపోతున్నారని, బీజేపీ మేనిఫెస్టోతో తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తోందని అన్నారు.

సోషల్ మీడియాను వాడుకుందాం..

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి కార్యకర్తలే తీసుకెళ్లాలని, సోషల్ మీడియాను ఓ ఆయుధంలా వాడుకోవాలని సూచించారు. మన దాహార్తిని తీర్చి పంటలకు నీరిచ్చే వంశధార ప్రాజెక్టు పూర్తవ్వడానికి యాభై ఏళ్లు పట్టిందన్నారు. ఆఫ్‌షోర్, తోటపల్లి, నారాయణపురం వంటి ప్రధాన ప్రాజెక్టులకు నిధులు ఇచ్చింది దివంగత నేత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. మన పాలకులకు ఈ ప్రాంతంపై పట్టింపు లేదు అనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. తాను ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయబోనని, ప్రభుత్వ విధానాలపై మాత్రమే మాట్లాడతానని ధర్మాన అన్నారు. పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్‌కైనా, అసెంబ్లీకైనా పోటీచేస్తానని తెలిపారు. తన బదులుగా మరొకరికి నాయకత్వం ఇస్తే వారికి మద్దతుగా ప్రోత్సహిస్తానన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం..

తాను పార్టీ మారతానని ఒకే ఏడాదిలో ఎన్నో పుకార్లు వచ్చాయన్నారు. కానీ అవన్నీ నిజం కావన్నారు. తన సైన్యాన్ని వదిలి వాళ్లతో మాట్లాడకుండా రాజకీయ రంగంలో యుద్ధం ఎలా చేయగలనంటూ ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి బాకాలు ఊదే పత్రికలను చదవవద్దని, నిరాధార కథనాలను ప్రసారం చేసే చానెల్స్ చూడవద్దన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా సోషల్ మీడియా వేదికగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో వేయిమందిని సోషల్ మీడియాలో భాగం చేస్తే ఎన్నికల నాటికి లక్ష్యం దిశగా చేరువ అవుతారన్నారు. ఆ రోజు సచివాలయ వ్యవస్థను నిష్పక్షపాతంగా ఏర్పాటు చేశామని, ఈ రోజు బదిలీల పేరిట అధికార పార్టీ నేతలకు ముడుపులు ఇస్తేనే పని జరుగుతోందన్నారు. టీడీపీ గురించి వలంటీర్లను ఎన్నికల ముందే హెచ్చరించామని, ఇప్పుడు తాము చెప్పినట్టే జరుగుతోందన్నారు.

వైఎస్ జగన్ మరింత బలపడితే ఈ కూటమిలో ఉన్న నాయకులే రేపు మనతో కలిసి వస్తారన్నారు. మీరంతా కలిసి పనిచేసి గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. టీడీపీ మేనిఫెస్టో ఏమిటన్నది క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే తెలిసిపోతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మన లక్ష్యమని తెలిపారు. సభాధ్యక్షుడు చిట్టి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ కళింగ వైశ్య, తూర్పు కాపు కుల విభాగాల రాష్ట్ర అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముఖలింగేశ్వరుని సన్నిధిలో తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ



ఆలయ సన్నిధిలో వెంకటేష్

జలుమూరు: ప్రసిద్ధి శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుడిని తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, మారిటైమ్ బోర్డు చైర్మన్ టి.ఎస్ వెంకటేష్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ చరిత్రను వివరించారు.

ఈదుపురంలో పోలీసు పహారా



పహారా కాస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం రూరల్: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు గోపి దారుణ హత్యకు గురైన నేపథ్యంలో ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. జూన్ 17న గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాట, రెండు రోజుల క్రితం కూటమి నాయకుడు విడుదల చేసిన వివాదాస్పద వాయిస్ రికార్డు దృష్ట్యా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా ఏఎస్‌ఐ శంకరరావు, ముగ్గురు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కరువు భత్యం చెల్లించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, సహాధ్యక్షుడు నెమలిపురి విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 జూలై నుంచి ఇప్పటివరకు నాలుగు విడతలుగా బకాయిలు పడ్డ డీఏలన్నీ కలిపి 16.38 శాతం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఇసుక వాహనాల అడ్డగింత



ఇసుక లారీలను నిలిపివేసిన చీడివలస గ్రామస్తులు

బూర్జ : ఇసుక వాహనాల రాకపోకలతో దుమ్ము ధూళి చెలరేగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ బూర్జ మండలం చీడివలస గ్రామస్తులు శనివారం పలు లారీలను అడ్డుకున్నారు. కాఖండ్యాం, తమరాం ఇసుక ర్యాంపుల నుంచి రాత్రీపగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక లారీలను అడ్డుకోవడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి పంపించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జీఎంఆర్ ఏఈఆర్‌ఓ ఆధ్వర్యంలో వివిధ ఎయిర్‌పోర్టుల్లో ఫైర్ ఫైటర్స్ పోస్టుల భర్తీకి ఈ డ్రైవ్ నిర్వహించారు. ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 24 ఏళ్ల యువత జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. 1600 మీటర్ల పరుగు, బరువు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. వివరాలు తర్వాత వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కొత్తూరు: కడుము గ్రామంలో అరసా ట్రేడర్స్ రైస్ మిల్లులో శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం, ఎస్‌ఐ టి.రామారావు, సీఎస్‌డీటీ భీమారావులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల 50 కిలోల బరువు గల 700 పీడీఎస్ బియ్యం బస్తాలను పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను విచారణ చేయగా.. కొత్తూరు మండలంలో టీడీపీ నేత, కడుము ఎంపీటీసీకి చెందిన అరసా రైస్ మిల్లు నుంచి బియ్యం తీసుకొస్తున్నట్లు చెప్పాడు. ఈ నేపథ్యంలో జిల్లా విజిలెన్స్ అధికారులు మిల్లులో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో వీఆర్వో చిన్న లోకేష్ పాల్గొన్నారు. కాగా, కొత్తూరు, తదితర మండలాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని చిల్లర వర్తకుల ద్వారా కొనుగోలు చేసి పాచిపెంట మీదుగా ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సమాచారం.

ఏదీ భద్రత ఇదేనా బాధ్యత..!





పబ్లిక్ ఏం చేయాలి..

రోడ్లపై ఇటువంటి దృశ్యాలు కనిపించినప్పుడు 1033 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.

- ఇష్టానుసారం వ్యవహరిస్తున్న ఇసుక వాహనాల నిర్వాహకులు
- వాహనాల నుంచి ఇసుక జారిపోతున్నా పట్టించుకోని వైనం
- జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడే ఇసుక మేటలు
- ప్రమాదాలకు ఆలవాలంగా మారిన హైవే కటింగ్ పాయింట్లు

చిత్రం చెప్పిన కథ

ఎచ్చెర్ల / శ్రీకాకుళం క్రైమ్: రహదారి భద్రత మనందరి బాధ్యత. చక్కటి నినాదం. కానీ భద్రత పాటిస్తున్నదెవరు? అంత బాధ్యతగా మెలుగుతున్నదెవరు. పై వాక్యాలకు నిదర్శనం ఈ చిత్రం. ఎచ్చెర్ల మండలంలోని కొయ్యరాళ్ల జంక్షన్‌లో సర్వీస్ రోడ్‌లోకి ఎంటరయ్యే ప్రదేశం ఇది. చూడండి ఎంత ఇసుక రోడ్డు మీద ఒలిగిపోయిందో.. ఈ ఇసుక కారణంగా గురువారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు చాలా మంది వాహనాలు ఇక్కడ అదుపుతప్పి స్కిడ్ అయ్యాయి కూడా. ఇసుకను తరలించే వాహనదారులు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. రహదారి బాధ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు కంట పడలేదో.. పడినా ఫిర్యాదు రాలేదు కదా అని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారో.. వాహనదారులకు మాత్రం చుక్కలు కనబడ్డాయి.

చట్టం ఏం చెబుతోంది..

హైవే రోడ్లపై ఇసుక, కంకర, ఊక, ఆయిల్ మరే ఇతర లోడులైనా ఒరిగిపడిపోయినప్పుడు వాటిని తక్షణమే క్లియర్ చేయాల్సిన బాధ్యత కన్సెషనర్లది (రోడ్డు కాంట్రాక్టర్లది). ఒకవేళ వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యి ఆగినా, ప్రమాదాలకు గురై ఎక్కువ సేపు నిలిచినా చుట్టూరా రేడియం స్టిక్కర్లు అంటించాలి. ఆ ప్రదేశంలో సూచీ బారికేడ్లు పెట్టాలి. కన్సెసనర్లు బాధ్యత విస్మరిస్తే ఇలాంటి ఒకట్రెండు నిర్లక్ష్యాలను చూసి ఎన్‌హెచ్‌ఏ వారు రెండు నోటీసులు జారీ చేస్తారు. అప్పటికీ మించితే వారిని తొలగిస్తారు.

ఏదీ ప్రమాదాల నివారణ.. నిరంతర నిఘా..

ప్రమాదాలకు ఆస్కారమైన.. వాహనాల రాకపోకలు అధికంగా సాగే జాతీయ రహదారిపై నిరంతరం సేవలందించే హైవే పెట్రోల్ సిబ్బంది దృష్టి కూడా ఈ ప్రాంతంపై పడలేదు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టుల్లో విధుల్లో ఉంటూ ప్రమాదాల కట్టడికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని చెప్పే వీరెవరి కంటినీ శుక్రవారం ఉదయం నుంచి ఈ ఇసుక రేణువు తాకలేదు.

పచ్చని ఉద్దానంలో విధ్వంసం తగదు



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు, రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్/మందస : పచ్చని చెట్లతో కోనసీమను తలపిస్తూ జిల్లాకు వరంగా ఉన్న ఉద్దాన ప్రాంతాన్ని కార్గో ఎయిర్ పోర్టు పేరుతో విధ్వంసం చేయడం తగదని వామపక్ష నాయకులు అన్నారు. జీడి, కొబ్బరిపంటలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఉద్దాన రైతులను నిరాశ్రయులను చేయడం ఎంత వరకు సమంజసమో చెప్పాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంత బాధిత గ్రామాల్లో శనివారం రైతులతో కలిసి కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా వామపక్షాల నాయకులు చైతన్య ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షులు కొమరవాసు, జోగి అప్పారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములను నమ్ముకున్న జీవనోపాధి సాగిస్తున్న ప్రజలను అభివృద్ధి పేరుతో పొట్ట కొట్టడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కొంత కాలంగా గ్రామస్తులు ఉద్యమాలు చేస్తున్నా కనీసం పట్టించుకోకుండా సర్వేలు చేపట్టడం దారుణమని మండిపడ్డారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబై, విశాఖపట్నం లాంటి నగరాలకు అనుసంధానంగా కార్గో ఎయిర్ పోర్టులు ఉన్నాయని, దేశంలో ఎక్కడా ప్రత్యేక కార్గో ఎయిర్ పోర్టు లేదని గుర్తు చేశారు. పచ్చని ఉద్దానాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్గో ఎయిర్ పోర్టు పోరాట కమిటీ నాయకులు కోనారి మోహన్‌రావు, బత్తిని లక్ష్మణ్, పోతనపల్లి కుసుమ, ఎన్.గణపతి, తెప్పల అజయ్‌కుమార్, పత్రి దానేష్, డి.హరికృష్ణ, కె.రమేష్, జోగి కోదండరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



ఉత్సాహంగా కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం వేదికగా జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్‌వీ జ్యూయలర్స్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పేరిట రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ మాట్లాడుతూ ఆరు విభాగాల్లో పోటీలు జరుగుతాయని, విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, జిల్లా బాడ్మింటన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు తదితరులు మాట్లాడుతు టోర్నీ నిర్వహణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, దాతలు కిరణ్‌కుమార్, ఊన్న కిరణ్‌కుమార్, గెంజి భీమారావు, కిమ్స్ సీఓఓ డాక్టర్ రవిసంతోష్, సోలార్ ఎనర్జీ నరసన్నపేట కె.రమణ, శీర రమణ, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు గురుగుబెల్లి ప్రసాద్, ఎంఈ రత్నాజీ, మెండ శాంతికుమార్, సంతోష్‌కుమార్, ఎల్.రవి, గురుగుబెల్లి రవి, శరత్, మోహన్‌సాయి, రిఫరీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన క్రీడాకారులు..

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. సుమారు 400 మంది బాలబాలికలు, సీనియర్ క్రీడాకారులు హాజరై ప్రతిభ చాటారు. అండర్–11, 13, 15, 17, 19 బాలబాలికలకు, అలాగే స్త్రీ, పురుషులు(సీనియర్స్) విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లలో పోటీలు జరుగుతున్నాయి. తొలిరోజు రాత్రి 10 గంటల వరకు పోటీలు జరిగాయి. ఆదివారం సాయంత్రంతో పోటీలు ముగుస్తాయని అంతర్జాతీయ క్వాలిఫైడ్ రిఫరీ, టోర్నీ చీఫ్ రిఫరీ సంపతిరావు సూరిబాబు తెలిపారు.

ముందుకు వెళ్లే దారేదీ?



రహదారి కష్టాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. శనివారం మహారాష్ట్రకు చెందిన లారీ పలాస నుంచి మెళియాపుట్టి వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా రోడ్డు మధ్య ఉన్న భారీ గొయ్యిలో కూరుకుపోయింది. ముందుకు కదల్లేకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- టెక్కలి రూరల్

280 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ



ఎరువులను సిద్ధం చేస్తున్న వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్...

జి.సిగడాం: మండలంలో అర్హత ఉన్న ప్రతి రైతుకు రాయితీపై ఎరువులు పంపిణీ చేస్తున్నామని జి.సిగడాం మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జీ తెలిపారు. ఈ నెల 11న 'బారులు తీరితేనే' ఎరువులు, ఈ నెల 12న 'ఎరువూ కరువే' అనే శీర్షికలతో సాక్షిలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. మండలానికి 280 మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయించారు. వీటిని పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

పాతపట్నం : పాతపట్నం మండల కేంద్రంలోని ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో మొబైల్ షాపు ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని మొబైల్ షాపు ఎదురుగా పాతపట్నం కొత్త దేవాంగుల వీధికి చెందిన వృద్ధుడు కొసమాన మోహనరావు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్పందించి పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుడు శేషుబాబు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి పంపించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారారు. వృద్ధుడి కుమారుడు కొసమాన మల్లేశ్వరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ జి.సింహాచలం తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఎచ్చెర్ల : ఎస్.ఎస్.ఆర్.పురం గ్రామానికి చెందిన నారాయణమ్మ (75) అనే వృద్ధురాలు చీమల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఏడాది కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న ఈమె గ్రామంలోనే చిన్న కుమార్తె దుర్గ ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 10న ఉదయం ఆమె అపస్మారక స్థితిలో ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. పక్కనే చీమల మందు గిన్నె కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు వృద్ధురాలిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష



సంఘీభావం ప్రకటిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: అర్హత ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, లోకేష్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తమ మాట నిలబెట్టుకొని మెమో 57ను అమలు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని మెమో 57 సాధన సమితి సమావేశంలో జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్జీఓ కార్యాలయంలో జరిగిన మెమో 57 సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రతి బాధితుడు తమ తమ ఇంటిలోనే గృహ దీక్షను చేపట్టాలని, అలాగే ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల వద్ద నిరసన దీక్షను 2003 డీఎస్సీ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా బాధిత ఉద్యోగులు కలెక్టరేట్‌కు అధిక సంఖ్యలో హాజరై పాతపింఛన్ సాధనలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో జిల్లా కో కన్వీనర్లు అంబటి లక్ష్మణరావు, అట్టడ తిరుమలేశ్వరరావు, కోర్ కమిటీ సభ్యులు గురుగుబెల్లి భాస్కరరావు, నంబూరి కృష్ణారావు, ఇప్పిలి సురేష్‌కుమార్, దుంపల అనిల్‌బాబు, కె.రామకృష్ణ, ఇ.రమణ, ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

బాలింతల మరణాలపై వైద్యబృందం ఆరా



విచారణ చేపడుతున్న విచారణ కమిటీ వైద్యుల బృందం

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీని శనివారం జిల్లా వైద్యుల బృందం పరిశీలించింది. ఈ ఆస్పత్రిలో చేసిన ప్రసూతి ఆపరేషన్ల కారణంగా ఇటీవల జలుమూరు మండలం పాగోడు, యలమంచిలి గ్రామాలకు చెందిన ఇద్దరు బాలింతలు మృతి చెందారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, డీసీహెచ్‌ఎస్, కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి జిల్లా ఆస్పత్రి నుంచి డాక్టర్ ప్రసూనాంబ, డాక్టర్ ప్రతిభా చైతన్య, డాక్టర్ ప్రకాశ్ వర్మ, డాక్టర్ శ్రీనుబాబు, డాక్టర్ కాళీ చరణ్‌లతో కూడిన కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మృతులు ఎప్పటి నుంచి ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు, ఆపరేషన్ చేసిన సమయంలో వారి ఆరోగ్య పరిస్థితి, తదితర వివరాలను ఆపరేషన్ చేసిన వైద్యురాలు శోభారాణి, ఇతర వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు.

వంశధార ఈఈగా రవీంద్ర



ఈఈ రవీంద్రకు అభినందనలు తెలుపుతున్న వంశధార సిబ్బంది

హిరమండలం: వంశధార కట్టడాల విభాగం ఈఈగా బి.రవీంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన ఎంపీ రమణ విజయనగరం బదిలీపై వెళ్లారు. జంఝావతి ప్రాజెక్టు ఈఈగా పనిచేసిన రవీంద్ర బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వంశధార డీఈ, ఏఈలు సిబ్బందితోపాటు హిరమండలం నీటి సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు అభినందలు తెలిపారు.